దేశానికి ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ

- అర్హులకు సంక్షేమం అందజేయడంలో వాలంటీర్ల పాత్రే కీలకం
- ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వాలంటీర్ వ్యవస్థ
- రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి ధర్మాన ప్రసాద రావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్ వ్యవస్థ కీలకపాత్ర వహిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. విజయవాడ ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో వార్డు, గ్రామ వాలంటీర్ల సేవలకు వజ్ర, రత్న, మిత్ర సేవా అవార్డులు అందజేతకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి సందేశం లైవ్ కార్యక్రమాన్ని శుక్రవారం బాపూజీ కళామందిర్ లో అందరూ వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా వాలంటీర్ వ్యవస్థ అని కొనియాడారు. పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో వాలంటీర్ల పాత్రే కీలకమని రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బాపూజీ కళామందిర్లో ఉత్తమ సేవలందించిన గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్ల సత్కార సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక గొప్ప మానవతావాది అని కొనియాడారు. ప్రభుత్వ పథకాలు పేదవారి ఇళ్లకు చేరే విధంగా ఉండాలని, ఆ వ్యవస్థే వాలంటీర్ వ్యవస్థని చెప్పారు. అవినీతిలేని వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ అని దీనిని కొనసాగించు కోవాలన్నారు. ప్రభుత్వానికి జవసత్వాలు, ఊపిరి వాలంటీర్లని పేర్కొన్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు సేవా వజ్ర, సేవ రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్లు చేస్తున్న సేవలకు ప్రభుత్వం వజ్ర, రత్న, మిత్ర సేవా అవార్డులు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామ, వార్డులలో లబ్ధిదారులను గుర్తించడం చాలా రోజులు పడుతుందని వాలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులను గుర్తించడం చాలా సులువు అవుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అర్హత కలిగిన జాబితా త్వరితగతిన రూపొందించడం జరుగుతుందని, అందుకు ప్రధాన కారణం ఈ సచివాలయ వ్యవస్థేనన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్లే కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 11, 216 మందికి సేవా మిత్ర, 174 మందికి సేవ రత్న, 40 మందికి సేవా వజ్ర, మొత్తం 11,430 ఉగాది పురస్కారాలు అందించి సత్కరించేందుకు జిల్లా కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం శాసన సభ్యులు రెడ్డి శాంతి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జడ్పీటీసీ సభ్యురాలు దివ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు మెంటాడ పద్మావతి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, సాధు వైకుంఠ రావు, గ్రామ, వార్డ్ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవారావు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ, వార్డు వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురష్కారాలతో సత్కరించారు.

సంఘాల ఉజ్వల భవిష్యత్తుకు ఉత్తమ ప్రణాళిక : ఏ.పి.ఎం. కూర్మారావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: గ్రామీణ మహిళా సంఘాల ఉజ్వల భవిష్యత్తుకు ఉత్తమ ప్రణాళికను తయారు చేసుకొని అమలు పరచాలని వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు సూచించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామ సంఘం అసిస్టెంట్ల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వార్షిక వర్క్ అండ్ ఫైనాన్స్ ప్లాన్ తయారు చేసుకుని, గ్రామంలో గల ప్రతి మహిళా పొదుపు సంఘం కూడా విధిగా పంచ సూత్రాలు పాటించేటట్లు ముఖ్యంగా సమావేశాలు, పుస్తక నిర్వహణ ,సొంత నిధుల సక్రమ వినియోగం గురించి సిబ్బంది ప్రణాళికను తయారు చేసుకొని అమలు పరచాలని ఆదేశించారు. సంఘ సభ్యులు తాము దాసుకున్న పొదుపు మొత్తాల లో నుంచి సభ్యుల అవసరం మేరకు అప్పులు ఇచ్చి వసూలు చేసుకోలేని సంఘం ఏ గ్రేడ్ లోనికి రాదని తెలిపారు. ఏ గ్రేడ్ లో ఉన్న సంఘ సభ్యురాలికి వ్యక్తి గతంగా యూనిట్ స్థాపించుకొని, ఉత్పత్తి ప్రారంభించి వ్యాపారం చేసుకుంటున్న మహిళలను గుర్తించి వారి సంస్థ అభివృద్ధికి కావలసిన మిషనరీ కొనుగోలు, తదితర వ్యాపార అభివృద్ధి అవసరాలకు కావలసిన రుణ సౌకర్యాన్ని బ్యాంకుల ద్వారా లేదా శ్రీనిధి ఋణ సౌకర్యం పొందేటందుకు అవసరమైన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసుకోవడానికి అవసరమైన పత్రాలు, సమాచారాన్ని తయారు చేయించడంలో ప్రతి ఎంటర్ప్రెన్యూనర్ మహిళకు మన మండల మహిళా సమాఖ్య సిబ్బంది సహకారం ఉంటుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి మహిళా రైతును కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేర్పించి ఆన్లైన్లో డేటా పొందుపరచాలని వివరించారు. 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసుగల మహిళలకు వారి అర్హతను బట్టి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతా ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులందరకు ఇల్లు కట్టుకోవడానికి అవసరమైన పెట్టుబడి కోసం, అర్హత గల మహిళలందరికి తాత్కాలిక రుణ సౌకర్యాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి వేనమ్మ, కోశాధికారి రేణుక, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, రామప్పడు, సుభద్ర, ఉమా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతు ధర కల్పించే చర్యలు చేపట్టాలి

మందస టీడీపీ మండలాధ్యక్షులు బావన దుర్యోధన

విశాలాంధ్ర-మందస : గౌతు కుటుంబాన్ని విమర్శించడమే వైసీపీ నాయకులు పనిగా పెట్టుకుంటున్నారని, ఈ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ చేసిన అభివృద్ధి వారికి కనిపించడం లేదని మందస మండల టీడీపీ మండలాధ్యక్షులు బావన దుర్యోధన, దాసరి తాతారావులు అన్నారు. శుక్రవారం మండలం హరిపురం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని, వాటిపై దృష్టిపెట్టకుండా కేవలం విమర్శలకే పరిమితమవుతున్నారని అన్నారు. అలుగాలం కష్టపడి జీడి రైతులు వారు పండించే జీడి పంటకు మద్దతు ధర కల్పించే చర్యలు వైసీపీ నాయకులు చేపట్టడం లేదని, మండలంలో గల సాగునీటి వనరులపై దృష్టి సారించకపోవడం విచారకరమని అన్నారు. దామోదర్‌సాగర్ కుడి కాలువ, జంతిబంద రిజర్వాయరు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. బంజిరి, కేశుపురం, పింపిడియా, పరిగాసాయి గ్రామాలకు రహదారులు, పుచ్చపాడు గ్రామానికి వంతెన ఎప్పటిల్లోగా నిర్మిస్తారని అన్నారు. కిడ్నీ రోగుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ సుజల మంచినీటి పథకాన్ని నిర్వీర్యం చేశారని, గతంలో 18 మండలాలకు సంబంధించి గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ప్రధాన కార్యాలయం పలాసలో ఉండేదని, ఇప్పుడు ఆ కార్యాలయం అనకాపల్లికి తరలిపోయినా దానిపై ఎందుకు వైసీపీ నాయకులు మాట్లాడడం లేదని నిలదీశారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు, ఒక్క చెరువు ఒక కాలువలోనైనా పూడిక తీశారా అని ప్రశ్నించారు. ఈ నాలుగేళ్ల కాలంలో వైసీపీ నాయకులు చేసింది కొండలు కరిగించడమే తప్పా ఇంకేమి లేదని అన్నారు. ఇప్పటికైనా అనవసర మాటలు అపి అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు. సమావేశంలో బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బైరిశెట్టి గున్నయ్య, సిర్ల కృష్ణారావు, నవీన్‌కుమార్, చౌదరి, మురళీ, బత్తిని కృష్ణారావు, కుప్పిలి వెంకటరావు, దాసరి శ్రీరాములు, ఎం.చంద్రశేఖర్, కె.నాగేశ్వరరావు, బొడ్డు తిరుపతి, అద్ది ఉమాపతి, బి.శంకరరావులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : చదువుతో క్రీడలు, చిత్రలేఖనం వంటి పోటీలు అవసరం అని సంతబొమ్మాళి, నౌపడ శాఖా గ్రంథాలయాల అధికారులు కె. కృష్ణారావు, బి. రూపావతి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సంతబొమ్మాళిలో కోకో పోటీలు నిర్వహించారు. అలాగే నౌపడ గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలు మేరకు వివిధ రకాల పోటీలు విద్యార్థులుతో నిర్వహించటం జరుగుతుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సహాయకులు ఎన్ ప్రసాద్, బాబూరావు పాల్గొన్నారు.

శ్రీ నీలమణి దుర్గ అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

విశాలాంధ్ర-పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానం దేవదాయ ధర్మాదాయ శాఖ పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారికి పాతపట్నం గ్రామానికి చెందిన సోపింటి అప్పారావు, కుమారుడు కిరణ్ కుమార్, మనవడు హెూషిధర్ చేత 756 గ్రాముల వెండి కిరీటం అమ్మవారికి కానుక గా సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, డిసిసిబి చైర్మన్ శ్యామ్, అర్చకులు అనుమంచిపల్లి వేణుగోపాలరావు, ఏ సుదర్శనరావు జి సంతోష్‌కుమార్ కమిటీ సభ్యులు పద్ద నేతాజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో వ్యవహరించి ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు సమన్వయంతో పనిచేసి జగనన్న ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ డిఇ నర్సింగరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాలను వేగవంతంగా జరిగేలా ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. నిర్మాణ దశలనుబట్టి ఎంత పేమెంట్ చేయనున్నది లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సోమవారం నాటికి మండలం మొత్తం జియోట్యాగింగ్ పూర్తిచేయాలన్నారు. గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కలసి ప్రజలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ప్రతీశనివారం గృహనిర్మాణ దినోత్సవం నిర్వహించాలని, గృహ నిర్మాణ దశలను పరిశీలించాలన్నారు. ఎంపిడివో పడాల చంద్రకుమారి మాట్లాడుతూ మండలంలో 18 ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబందించి బిల్లులు మంజూరయ్యాయని, వాటిని వేగవంతంచేసి, పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో వారితో పాటుగా గృహనిర్మాణశాఖ ఎఇ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులున్నారు.

ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు ఒ క ప్రకటన ద్వారా తెలిపారు. ఆరవ తరగతి ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీలకు 75 రూపాయలు, ఓబీసీ బీసీలకు150 రూపాయలు ఆన్లైన్ లో రుసుము చెల్లించి ఈనెల 7వ తేదీ నుండి 25వ తేదీ లోగా (హెచ్‌టీటీపీఎస్:/ఏపీఎంఎస్.ఏపీ.ఇన్/పీఎంఎస్) వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు కొరకు మే 22వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు ఎస్ సి,ఎస్ టి లకు150 రూపాయలు, ఓసి,బిసి,ఈడబ్ల్యూఎస్ వారు 200 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.పదవ తరగతిలో మార్కులు మెరిట్ ద్వారా రిజర్వేషన్ల రూల్స్ ప్రకారం అడ్మిషన్లు జరుగునని ప్రిన్సిపల్ ఈశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉద్దానం ప్రాంతానికి మెరుగైన విద్యుత్ సేవలందించండి

విశాలాంధ్ర-సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉద్దానం ప్రాంతం ప్రతి ఏటా తుపాన్లు, ఈదురు గాలులు సమస్యలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఈ ప్రాంతానికి మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని ఎపిఈపీడిసిఎల్ చైర్మన్అండ్ మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ ప్రాజెక్ట్ వారిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త పిరియాసాయిరాజ్ విజ్ఞప్తిచేశారు. విజయవాడలో శుక్రవారం వారిని కలిసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో భూగర్భ కేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ అంతరాయాన్ని నివారించడానికి కవర్ కేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. కవిటి నుంచి మాణిక్యపురం వరకు త్రిఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కవిటి సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. రాజపురం నుంచి బొరివంక సబ్‌స్టేషన్ వరకు ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేసి నిరంతరం జరిగే విద్యుత్ అంతరాయాలను తొలగించాలని కోరారు. డయాలసిస్ కేంద్రాలకు విద్యుత్ హెచ్చుతగ్గులను గుర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు అహంకారి

- పేదల ఇళ్లను సమాధులంటారా!
- టిడిపీ సమాధి కావడం ఖాయం
- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-జలుమూరు : దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మహా యజ్ఞంలా ఇక్కడ పేదల ఇళ్ల నిర్మాణం సాగుతుంటే వాటిని సమాధులతో పోల్చుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి ప్రతీకని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. ఓట్లు వేయడానికి మాత్రమే పేదలు పరిమితం కావాలా? పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబుకు ఎందుకు కడుపుమంట? అని ప్రశ్నించారు. బాబు వ్యాఖ్యలకు నిరసనగా చల్లపేట జంక్షన్లో జగనన్న కాలనీలో పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ఆయన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఒక్క సెంట్ భూమి ఇవ్వని బాబుకు, టీడీపీకి సమాధి కట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. చంద్రబాబు తీరు మార్చుకోకపోతే ఆయన్ను రాజకీయ సమాధి చేసేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందని ఎంతమంది ఏకమైనా మళ్లీ సీఎం గా వైయస్ జగన్ వస్తారని అన్నారు. పేదలంటే చంద్రబాబుకు చులకన భావమని, వారంతా ఆయనకు గట్టిగా బుద్ధి చెప్పేందుకు ఎదురుచూస్తున్నారని కృష్ణ దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యా మలరావు, రాజప్పల నాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సీతారాం, మండల సలహాదారుడు పైడి వితలరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, దామ మన్మధరావు, జుత్తు నేతాజీ, కరవంజ కూర్మారావు, పంగ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్, పైడి ప్రవీణ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గానూ పదవ తరగతి పాసైన విధ్యార్థులు ఆన్‌లైన్‌లో ఇంటర్మీడియట్‌కు ధరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 22వ తేదీ నుండి వచ్చే జూన్ నెల 7వ తేదీ వరకూ ధరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మా కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఈసి, సిఈసి కోర్సులు అందుబాటులో వున్నాయని, ఎస్.సి, ఎస్.టి విధ్యార్థులకు రూ.150, ఓసి, బిసి విధ్యార్థులకు రూ.200 ఫీజు చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కొరకు ఈ సెల్ నెంబర్లు 9652730073, 8317687560కు సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్, ప్రవీణ కోరారు.

బ్రహ్మణ రేవును బాగు చేయరూ!

విశాలాంధ్ర-జలుమూరు : మండలం శ్రీముఖి లింగం గ్రామంలో బ్రాహ్మణ కుటుంబీకుల కొరకు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ రేవును పలువురు ఆక్రమించుకొని పంటలు పండించుకుంటూ ఉన్నారని, గతంలో నాతోపాటు పలువురు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడు గారి రాజశేఖర్ ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో. విచారణ నిమిత్తము శ్రీముఖలింగం గ్రామంలో జలుమూరు మండల సర్వేయర్ బ్రాహ్మణ రేవు రీ సర్వే చేసి జెండాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అయితే ఈ బ్రాహ్మణ రేవు జాతీయ ఉపాధి పనులు కింద బాగు చేయాలని గతంలో ఏపీవోకు చెప్పినప్పటికీ బాగు చేయలేదని, కాబట్టి డ్వామా పిడి చిట్టి రాజు తక్షణమే అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే 6 ఆర్ వంశధార పిల్ల కాలువ మరమ్మతులకు గురవడం వల్ల వేలాది ఎకరాలు సాగు చేయడానికి నీరు అందక రైతులు ఇబ్బందులు గురవుతున్నారని, తక్షణమే ఈ పిల్ల కాలువను కూడా బాగు చేస్తారని విజ్ఞప్తి చేస్తున్నామని తెలియజేశారు.

'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-పాతపట్నం : జగనన్నకి చెబుదాం, స్పందన(1902) కార్యక్రమం పట్ల మండలస్థాయి అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంచు కరుణాకర్ రావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో మండల స్థాయి అధికారులు అందరితో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారము మండలంలో ఎంపీడీవో తాసిల్దార్, ఎస్ఐ, అగ్రికల్చర్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ లతో పర్సనల్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ మండలంలో జగనన్నకు చెబుదాం కింద వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి సరైన పరిష్కారం వచ్చేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎవరైనా లబ్ధిదారుడు 1902 కి ఫోన్ చేసి గ్రీవెన్స్ గురించి చెబితే దానికి సంబంధించిన డిపార్ట్మెంట్ వ్యక్తులు ఆ లబ్ధిదారుని దగ్గరికి వెళ్లి ఆయన ఇచ్చే విజ్ఞప్తిని తీసుకొని దానికి సరైన సమాధానం ఇచ్చేలా మండల స్థాయి అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుడు సంతృప్తి చెందకపోతే సంబంధిత డిపార్ట్మెంట్ వ్యక్తులను బాధ్యులుగా గుర్తించి వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కనుక ప్రతి ఒక్క ఉద్యోగి తనకు సంబంధించిన గ్రీవెన్స్ ను చక్కగా పరిష్కారం చేసి లబ్ధిదారుడు సంతృప్తి పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో జయంతి ప్రసాద్, ఎస్ఐ కామేశ్వరరావు, ఏవో అప్పలనాయుడు, ఈవోపీఆర్డి నరసింహ ప్రసాద్ పండా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు యంత్ర పరికరాలు అందజేత

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బెజ్జీపుట్టుగ రైతు భరోసా కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం ద్వారా రైతు సంఘం గ్రూపు సభ్యులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేశారు. ఈ మేరకు శుక్రవారం రోటోవేటర్, నాగలి సెట్లు, స్ప్రేయర్లు, రాయితీపై రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ హేమ సుందర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ద్వారా గ్రామంలోని రైతులు గ్రూపులుగా ఏర్పడి కేవలం 10 శాతం డబ్బులు చెల్లిస్తే చాలు. ట్రాక్టర్లతో సహా ఇతర యంత్ర పరికరాల విలువలో 40 శాతం రాయితీ మరో 50 శాతం అతి తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ యంత్ర ఉపకరణాలన్నీ ఆర్బీకే పరిధిలో అందుబాటు లో ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏస్ వి నారాయణ స్వామి, రైతు సంఘం సభ్యులు మాదిన రవి, బొడ్డ మోహనరావు, పి వి ఎస్ రాంబాబు, పి మురళి, వి ఏ ఏ అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రణస్థలం: మండలం జీరుపాలెం గ్రామంలో శుక్రవారం ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు, టీ తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రక్తదానం శిబిరం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు అభిమానులు ఏర్పాటు చేశారు. రక్తదానం కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గ నాలుగు మండలాల నుండి పెద్దఎత్తున తరలివచ్చిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, యన్టీఆర్ మేలు కోరుకునే అభిమానులు అందరు ప్రతి సంవత్సరం గ్రామాలలో పలు సేవాకార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న యువత, రక్తదాన శిభిరాలు ఏర్పాటు చేస్తూ ఎందరో అభాగ్యుల ప్రాణాలను కాపాడుతున్నారని ఇందుకు ప్రతి ఒక్కరు తరలి రావాలని పిలుపునిచ్చారు. మనందరి అభిమాన హీరో జనహృదయ విజేత నందమూరి తారక రామారావు 40వ జన్మదిన సందర్భంగా టీం తారక్ ట్రస్ట్ ఎచ్చెర్ల నియోజకవర్గం (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో "జీరుపాలేం" గ్రామంలో 2వేలు మందికి అన్నదాన కార్యక్రమం, 113 యూనిట్లు బ్లడ్, 200 మొక్కలు పంపిణీ తోపాటు పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గ్రామాలాభివృద్ధే ధ్యేయం : మంత్రి డా.అప్పలరాజు

విశాలాంధ్ర-మందస : పలాస నియోజకవర్గంలోగల గ్రామాలాభివృద్దె ధ్యేయమని రాష్ట్ర మంత్రి డా. అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలం హంసరాలిలో గడప గడప కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నర్సింగపురం పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేసారు. మండలం దేవుపురం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పాల పోలమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీపీ నిధులతో దేవుపురంలో నిర్మించిన బస్ షెల్టర్ ను పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. నర్సింగపురం పంచాయతీలో సుమారు రూ.25 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయంను పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డొక్కర దానయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల ఎన్టీఆర్ ఎంహెచ్ఎస్ పాఠశాల ఆట స్థలములో బాస్కెట్ బాల్ కోర్టుకి ఆనుకొని ఉన్న పవర్ సప్లై స్థంభం వద్ద కరంటు తీగలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. వేసవి సెలవులు కావటంతో నగర వాసులతో పాటు వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొనే పిల్లలు ఉదయము, సాయంత్ర, రాత్రి వేళల్లో అక్కడే ఉండి శిక్షణ తీసుకుంటున్నారు. ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో తెలియదు కాబట్టి సంబంధిత అధికారులకు అక్కడ ఉండే నిర్వాహకులు తెలియజేయాల్సిన అవసరం వుంది. అలాగే ఎంతో మంది పెద్దలు అక్కడకు వచ్చి సేద తీరుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బయటకు వచ్చే కరంటు తీగలను సరిచేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పారసాంబ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలపోలమ్మ గ్రామదేవత ఆలయ అభివృద్ధికి వార్డు కౌన్సిలర్ గీతారవి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని నిర్వహకులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని, ప్రజలు సహకరించాలని కోరారు. 10వ ఆర్థిక సంఘం నిధులతో దేవాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తి అయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు ధరఖాస్తులు సేకరిస్తున్నట్లు కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పి.వో శార్వాణి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ పెద్దతామరాపల్లి-1, రౌతుపురం, వల్లభరాయపాడు, బెజ్జిపల్లి ప్రాంతాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, పూడిలంక మినీ అంగన్వాడీ కార్యకర్త, హుకుంపేట, కొత్త అగ్రహం, దేవుపురం, బోరుబద్ర, కణితివూరు-1, ఎంఎన్‌పే-1, పల్లివూరు-1, కొండవూరు, చినడోకులపాడు, సైనూరు, లొద్దభద్ర, సున్నాడ, బంటుకొత్తూరు ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటిని ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

భానుడి జోరు, పవర్ కట్‌తో ఇబ్బందులు

విశాలాంధ్ర-పాతపట్నం : ఈనెల 21వ తేదీ నుంచి పాతపట్నంలో జరగబోయే అమ్మవారి పండగల సందర్భంగా విద్యుత్ సమస్యల రాకుండా ఉండేందుకు ముందస్తుగా పాతపట్నం పలు వీధుల్లో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం శివశంకర కాలనీ తో పాటు పలు వీధుల్లో నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాట్లు చేయడంతో ఉదయం నుంచి పాతపట్నంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే ఈ పనులు చేపడతాం, విద్యుత్ సరఫరాయకు అంతరాయం ఉంటుందని ముందస్తు సమాచారం ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు ఇవ్వకపోవడంతో గృహ సముదాయాలకు వాడుక నీరు కూడా నిల్వ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఐస్ క్రీమ్స్, కేక్స్ మెల్ట్ అయి అసలకు ఎసరు వస్తుంది. అదే రీతిలో పాలు, పెరుగు వ్యాపారాలకు కూడా నష్టాలు వస్తున్నాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిని పొదుపుగా వాడండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు నీటిని అందించే పంప్ హౌస్‌లో గల మూడు మోటర్లకు గాను రెండు మరమ్మత్తులకు గురైనట్లు కమీషనర్ ఎస్.రమేష్ తెలిపారు. వాటిని పునరుద్ధరించే చర్యలు చేపడుతున్నామని, ప్రస్తుతానికి ఒక మోటర్ ద్వారానే పంపింగ్ జరుగుతుందన్నందున ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. సాంకేతిక సమస్య కారణంగా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయగల్గుతామని స్పష్టం చేసారు.

కలగానే మిగిలిన జీడి పరిశోధన కేంద్రం

ఎన్నికల హామీలకే పరిమితం..!

విశాలాంధ్ర-పలాస/వజ్రపుకొత్తూరు :ఉద్దాన ప్రాంతంలో విస్తారంగా పండుతున్న జీడి పంటకు ఈ ప్రాంతంలో పరిశోధన కేంద్రం ఏర్పాటు ఈ నాటికి కలగానే మిగిలిందని, కేవలం రాజకీయ నాయకులకు ఎన్నికల హామీలకే పరిమితమైందని జీడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు గత 15ఏళ్లుగా ఎదురు చూసిన రైతాంగానికి నిరాశే మిగులుతోంది. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా పరిశోధన కేంద్రం మాత్రం ఏర్పాటు కావడం లేదు. దీంతో జీడి సాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరువవ్వడంతో పంటలకు సోకిన తెగుళ్లతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు ఈ ప్రాంతానికి వచ్చి అవగాహన కల్పించాల్సి దుస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం పలాస డివిజన్ కేంద్రం మారిన నేపథ్యంలో ఉద్దానంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుందని వారు ఎదురు చూస్తున్నారు. దేశంలోనే జీడి సాగులో నవ్యాంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో లక్షా 26వేల 121 హెక్టార్ల విస్తీర్ణంలో జీడి తోటలున్నాయి. రాష్ట్రంలో 11 జిల్లాల్లో ఈ పంట అధికంగా సాగు చేస్తుండగా అందులో జిల్లా మూడో స్థానంలో ఉంది. ముఖ్యంగా ఉద్దాన ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి మండలాల్లో రైతులు జీడి పంటను అధికంగా పండిస్తున్నారు. ఉద్దాన జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వడంతో జీడి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాని అది కార్యరూపం దాల్చలేదు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి పలాస మండలం రామక్రిష్ణాపురంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చారు. ఆ సమయంలో ఈ ప్రాంత జీడిరైతులు ముఖ్యమంత్రిని కలిసి జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా తరువాత ఈ విషయాన్ని మర్చిపోయారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, హామీ ఇవ్వడం అమలు కాకపోవడం జరిగిపోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా జీడి పరిశోధన కేంద్రంపై దృష్టి సారించకపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోతున్న జీడి రైతాంగం : ఉద్దాన ప్రాంతంలో అధిక సంఖ్యలో జీడి రైతులున్నారు. జీడి సాగులో సాంకేతిక నైపుణ్యత, లోపాలు తెలిసే వారు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య పంటైన జీడికి తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. చిగురు, పూత, పంట ఏపుగా పెరిగే సమయాల్లో చీడపీడలు ఆశిస్తాయి. వేసవిలో వేకువన కురిసే పొగమంచుతో పూత మాడిపోవడం, రాలిపోవడం, జీడి పిక్కలు నల్లగా బూజు పట్టినట్లు తయారవుతాయి. ఇలాంటి సమయంలో ఎటువంటి మందులు వాడాలి, ఏ విధంగా పంటను కాపాడుకోవాలో తెలియక జీడి రైతులు ఇబ్బందులు పడుతుంటారు. తెగుళ్ల నివారణకు ఎటువంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.. పూత రావడానికి ఏ మందులు వినియోగించాలి వంటి అంశాలపై వారికి సరైన అవగాహన లేకపోవడం, దీనిపై సూచనలు, సలహాలిచ్చేందుకు స్థానికంగా శాస్త్రవేత్తలు లేకపోవడం, సుదీర్ఘ ప్రాంతంలో గల బాపట్ల తదితర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు ఇక్కడికి వచ్చి రైతులకు సూచనలిస్తున్నారు. అది కూడా కేవలం ఒకటి రెండు ప్రాంతాలకే పరిమితమై నామమాత్రపు సూచనలు కావడంతో సరైన ఫలితాలు రావడం లేదని, జీడి రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతంలో జీడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జీడి రైతులు కోరుతున్నారు.

పలాసలో ఏర్పాటు చేయాలి: ఉద్దానం జీడి రైతులకు మేలు చేసేలా పలాసలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, ఇతర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు వచ్చి జీడి సమస్యలపై సలహాలిస్తున్నా సరైన ఫలితాలు రావడం లేదని, దీనిపై ప్రభుత్వం అధికారులు ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

సమస్యలపై పోరాడటమే కామ్రేడ్ సుందరయ్యకు మనమిచ్చిన నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తులసీదాస్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే కామ్రేడ్ సుందరయ్యకు మనమిచ్చిన ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. తులసీదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక కోటబొమ్మాళి కళ్యాణ మండపంలో జరిగిన సుందరయ్య వర్ధంతి సభ సిపిఎం పార్టీ మండల నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య తన యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహాయోధుడు అని కొనియాడారు. ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్మించారని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రకృతి వనరులను ఆదానీ , అంబానీ ఆస్తిగా మార్చేస్తుందని విమర్శించారు. ప్రజల సంపదతో నిర్మితమైన బ్యాంకులు, రోడ్లు, రైల్వే, బిఎస్ఎన్ఎల్, పోర్టులు, ఆయిల్ సెక్టార్, విద్యుత్, స్టీల్ ప్లాంట్లు బిజెపి కార్పొరేట్లకు ధారాధత్తం చేస్తుందని విమర్శించారు. బిజెపి విధానాలను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళుతుందని విమర్శించారు. మూలపేట పోర్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 6,470 ఎకరాలు ఆదానికి కట్ట బెట్టారన్నారు. రాష్ట్ర వైసీపీ, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి భజన చేస్తున్నాయని విమర్శించారు. విభజన హామీలు ప్రత్యేక హెూదా అమలు చేయని బిజెపికి వ్యతిరేకంగా వైసిపి, టిడిపి జనసేన ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే సుందరయ్యకి మనం ఇచ్చిన నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ షణ్ముఖరావులు మాట్లాడుతూ వంశధార కాల్వకు మరమ్మత్తులు చేసి ఇచ్ఛాపురం వరకు నీరు ఇవ్వాలని, కొండపేట ఎత్తిపోతల పథకం గత మూడు సంవత్సరాలు నుండి మరమ్మత్తులు ప్రభుత్వం చేయకపోవడంతో నీరు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. వెంటనే మరమ్మత్తులు చేసి నీరు అందివ్వాలి అని డిమాండ్ చేశారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు 16,000 రూపాయలు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించి, ప్రభుత్వం ఆర్‌బీకేలద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ పాలిసింగ్ యూనిట్‌లో స్థానికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు గొండు నీలన్న, సన్యాసి, బాస్కర రావు, గురువులు, కాంతారావు, సూర్యనారాయణ, శ్రీను, ఆనంద్, సీపాన నర్సింహులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను శాఖ గ్రంథాలయ అధికారి, ఛాయారతన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పర్యావరణం పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని, ఈ పోటీల్లో సుమారు 26మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు వేసవి శిబిరం ముగింపు వేడుకల్లో బహుమతి ప్రధానం చేస్తామని తెలిపారు.

అమరావతిలో పేదలకు పట్టాల పంపిణీ తథ్యం

- బాధ్యతగల ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ప్రజా పక్షాన నిలవాలి
- రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఏకమైనా అంతిమ విజయం వైసీపీ దే
- రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పిస్తే, దానిని స్వాగతించాల్సిన ప్రధాన ప్రతిపక్షం.. పట్టాల పంపిణీ కి అడ్డుతగలడం తగదని రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో లబ్దిదారుడికి 256 చదరపు అడుగులు స్థలాన్ని ఇస్తే, ప్రస్తుత వైసీపీ సర్కార్ ప్రతి లబ్దిదారునకు 440 చదరపు అడుగులను ఇచ్చేందుకు చర్యలు చేప ట్టిందన్నారు. చచ్చిన శవాన్ని పాతుకు నేందుకు ఇది సరిపోదు అంటూ, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యా నించడం తగదని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ప్రజలు అప హాస్యంగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆర్ -5 జోన్ పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు పేదల ముఖాల్లో ల్లో వెలుగులు నింపాయన్నారు.. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకోవడం అన్యాయ మైన చర్య అని, రాజధానిలో పేదలు వద్దని చెబుతున్న తెలుగుదేశం పార్టీ నేతలు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్ని ఓట్లు అడుగు తారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ఉన్న భూమిని పేదలకు ఇస్తే తప్పేంటని నిలదీ శారు.పేదలకు స్థలాలు ఇస్తుంటే అడ్డుకోవడం అన్యాయమైన చర్య అని అలాంటి ఆలోచన ఎవరికి రాకూడదన్నారు.పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకోవాలనే దుర్మార్గమైన ఆలోచన టిడిపి అండ్ కో కి వచ్చిందని,సుప్రీం కోర్టుకు పోవడం బరి తెగింపునకు నిదర్శనమన్నారు.ప్రతిపక్షాల తీరు అన్యాయంగా ఉందని,ఒక రాజకీయ పార్టీగా తెలుగుదేశం పార్టీ తన అర్హత కోల్పోయిందన్నారు. పేదల కడుపు కొట్టాలని చూస్తున్న తెలుగుదేశం,జనసేన పార్టీలు ఏ మొహం పెట్టుకొని ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వస్తారని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అనగారిన ప్రజానీకం పట్టాల పంపిణీ అడ్డుకుంటున్న ప్రతిపక్షాలపై తిరగబడాలని ఆయన పిలు పునిచ్చారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నిన పట్టాల పంపిణీ జరుగుతోందని తేల్చి చెప్పారు. ప్రతిపక్షాలకు ధన బలం ఉంటే, తమకు ప్రజాబలం ఉందన్నారు.అణగారిన వర్గాలంతా వైసిపి కి అండగా నిలుస్తా రన్నారు.రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలంతా ఏకమైన.. అంతిమ విజయం వైసిపిదేనని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు దుంపల శ్యామలరావు పొన్నాడ చిన్నారావు, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-పలాస: భూమి కోసం భుక్తి కోసం పేదప్రజల విముక్తి కోసం కామ్రేట్ పుచ్చలపల్లి సుందరయ్య ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన సాధన కోసం కృషి చేయడమే నిజమైన నివాళు అని సిపిఎం నాయకులు ఎన్.గణపతి అన్నారు. శుక్రవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుందరయ్య నిరాడంబర, నిస్వార్థ జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఓంకార్, ప్రజాసంఘాల నాయకులు టి.అజయ్ కుమార్, ఐక్యా నాయకులు ఎన్.ఢిల్లేశ్వరి, కె.భాగ్యలక్ష్మీ, శశిధర వర్మ, సుందరి, వీరాస్వామిలు పాల్గొన్నారు.

జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లా ప్రజా పరిషత్, సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ప్రజా పరిషత్ 2వ, 4వ, 7వ, 1వ స్థాయీ సంఘాల సమావేశాలకు వివిధ శాఖల అధికారులు సమర్పించిన నివేదికలను సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పిరియా విజయ మాట్లాడుతూ... 2వ స్థాయీ సంఘ సమావేశములో గృహ నిర్మాణ శాఖ, సహకార శాఖ, చేనేత మరియు జౌళీ శాఖ, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా నీటి యాజమాన్య శాఖ, పరిశ్రమల శాఖ, గ్రంధాలయ సంస్థ, జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ ల యొక్క జిల్లా అధికారులు సమర్పించిన నివేదికలను సమీక్షిస్తూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో గృహ నిర్మాణ శాఖ పై సమీక్షించినపుడు జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతముగా పూర్తి చేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధముగా అధికారులు కృషి చేయవలసినదిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 4వ స్థాయీ సంఘ సమావేశములో విద్యా శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు సమర్పించిన నివేదికలను సమీక్షిస్తూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. 7వ, 1వ స్థాయీ సంఘ సమావేశములో ఐఅండ్‌క్యాడ్ ప్రత్యేక పరిశోధనా విభాగం , రహదారులు, భవనాలశాఖ, ఏపీఎస్ఐడీసీ, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ , రవాణా శాఖ, పంచాయతీ రాజ్,గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం, (విద్యుత్ శాఖ), నీటి పారుదల శాఖ, గనులు, భూగర్భ శాఖ, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్ డివిజన్ అధికారులు సమర్పించిన నివేదికలపై సమీక్షిస్తూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలలో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం శాఖ నుద్దేశించి వేసవి దృష్ట్యా గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టి ప్రజలకు మంచి నీరు అందించాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమదాలవలస నుండి శ్రీకాకుళం వరకు గల రోడ్ పూర్తిగా పాడయి పోయి వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారని, ఎక్కువ ఏక్సిడెంట్ లు జరుగుచున్నందున, సదరు రోడ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశాలు జారీ చేసియున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ తో పాటు, ఆర్ వెంకట్రామన్, ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, శ్రీకాకుళం వారు, గౌరవ జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12 రోజు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-రణస్థలం : శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా 12వ రోజు శుక్రవారం దినపత్రికలు చదవడం, కథలు చదివించడం రాయించడం నేర్పించారు. కె భాస్కర రావు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ కర్సివ్ రైటింగ్ ఎలా రాయాలో నేర్పించారు. ఆర్ నర్సింగ్ రావు పట్నాయక్ (డ్రాయింగ్ టీచర్) చిత్రలేఖనం వలన విద్యార్థులకు చేతిరాతతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగి ఆర్ ధర్మారావు, నీతి కథలు (నల దమయంతి కథ, మహానుభావులని నమ్మాలి, మంచి తీర్పు, తల్లిదండ్రుల పట్ల ఎలా ఉండాలి, వాటి గురించి వివరించారు. తదనంతరం విద్యార్థినీ విద్యార్థులు క్యారమ్స్, పజిల్స్, బిజినెస్ గేమ్, ఆటల్లో పాల్గొన్నారు.

రైతులకు మేలు జరగాలి

- ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు
- రైతుల్లో అవగాహన కల్పించడం మనందరి బాధ్యత
- రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రైతులు లాభసాటి పంటల దిశగా మొగ్గు చూపేలా వ్యవసాయ అధికారులు చొరవ చూపాలని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. జిల్లా రైతులు వరిని సంప్రదాయ పంటగా అలవాటు పడ్డారని, వరితో పాటు మరింత లాభాలను ఆర్జించేలా నువ్వు, మొక్కజొన్న, మినుములు,పెసర, శనగ వంటి ఇతర పంటల వైపు దృష్టి సారించేలా చైతన్యపరచాలన్నారు. తద్వారా రైతులకు మరింత మేలు జరగాలని, ఈ విషయంలో వ్యవసాయ అధికారులు సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించి రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు వరితో పాటు ప్రత్యామ్నాయ పంటలను పండించేలా చేయడం మనందరి భాధ్యత అని మంత్రి గుర్తుచేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నీటి పారుదల సలహా మండలి 29వ సమావేశం మరియు వ్యవసాయ సలహా మండలి సమావేశాలు రెవిన్యూ శాఖ మంత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమీక్షలో పాల్గొన్న ఆయన సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, మార్కెట్లో జోరుగా పోతున్న వరి రకాలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని, దానికి అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు వ్యవసాయానుకూల ప్రాంతాలను సందర్శించి, వరిని తగ్గిస్తూ అధిక దిగుబడి మరియు లాభాలను అర్జించే పంటల వైపు దృష్టిసారించేలా అవగాహన కల్పించాలని తెలియజేయడం జరిగిందన్నారు. దీనివలన రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే అవసరమైన ఎరువులను, విత్తనాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులను పంపడం జరిగిందని మంత్రి వివరించారు. రైతు జిల్లా,మండల కేంద్రానికి పోకుండా తమ గ్రామంలో ఉండే రైతు భరోసా కేంద్రంలోనే ఎరువులను కొనుగోలు చేసేలా సదుపాయాలను తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఆ పనులను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని, అధికారులు ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. గతేడాది వ్యవసాయ అధికారులు వేసిన అంచనాలు సత్ఫలితాలను ఇచ్చాయని, ఇందుకు వ్యవసాయ అధికారులను అభినందిస్తున్నట్లు మంత్రి వివరించారు. సకాలంలో రైతులు దిగుబడి సాధించడమే కాకుండా, వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇందులో జిల్లా యంత్రాంగం, అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం నీటిపారుదల మండలి గురించి మాట్లాడుతూ జిల్లాకు నీటివనరులు చాలా ప్రధానమైనవని మంత్రి తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజనులో సాగునీరును అందించేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కొన్ని పనులు మంజూరు చేశారని, పిల్ల కాలువలను, ఇతర పనులను ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. ఇతరత్రా చిన్న చిన్న పనులు సీజనుకు ముందే పరిష్కరించడానికి అవసరమైన పనులు చేయడం జరిగిందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు సంబంధిత ఆయకట్టుదారులు, ఆ ప్రాంత ప్రతినిధులతో సంబంధాలు ఎప్పటిలాగే కలిగిఉండాలని సూచించినట్లు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, శాసనమండలి సభ్యులు నర్తు రామారావు, శాసనసభ్యులు రెడ్డి శాంతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా నీటిపారుదల సలహా మండలి చైర్ పర్సన్ చల్లా అలివేలుమంగ, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సలహా మండలి సభ్యులు గొండు రఘురామ్, జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డిసిసిబి అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్. లక్ష్మీప్రసన్న, డ్వామా పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాదరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, నీటి పారుదల సలహా మండలి సభ్యులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై చెట్టు పడి డ్రైవర్‌కు గాయాలు



విశాలాంధ్ర - ఆమదాలవలస : ఒక్కసారిగా శుక్రవారం సాయంత్రం పెనుగాలులు వేయడంతో చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. ఘాడమైన మేఘాలు ఒక్కసారిగా అలముకొని విపరీతమైన గాలులు రావడంతో పాత నిమ్మతొర్లాడు వద్ద మామిడి కొమ్మ విరిగి ట్రాక్టర్ పై పడటంతో డ్రైవర్ దవల జితేంద్రకు బలమైన గాయాలు తగిలాయి. దీంతో 108 సహాయంతో శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జితేంద్ర స్వగ్రామం కొత్తవలస. అక్కడే ఉన్న ఇటుక బట్టీలకు ట్రాక్టర్ తో మట్టిని తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. కొమ్మ విరిగి ట్రాక్టర్ పై పడిన సమయంలో పెద్ద శబ్దాలు రావడంతో కూలీలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే 108 కి స్థానికులు ఫోన్ చేయగా దుర్గారావు, శేఖర్, అంజిబాబు, 108 సిబ్బంది, వైద్య పరీక్షలు నిర్వహించి కాలు దెబ్బ తినడంతో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

22 నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం గుంజిలోవ గ్రామంలో ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేది వరకు మూడురోజులు శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షిక మహెూత్సవం ఘనంగా జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ నిర్మాణ, శాశ్వత ధర్మకర్తలు పేడాడ చిరంజీవులుభారతిలు అన్నారు. 22వ తేదీన ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 4 గంటలకు రథోత్సవములు, 23వ తేదీ ఉదయం 9 గంటలకు నవకల శస్నపనము, 24వ తేదీ చివరిరోజు స్వామివారి కళ్యాణము, పూర్ణాహుతి, చక్రస్నానములు చేయటం జరుగుతుందని, అలాగే మద్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఈ మూడు రోజులు ఆలయ పరోహితులు సుసరాపు గణపతిశర్మ, రంపా ఆదిత్యశర్మలతో ప్రత్యేక పూజలు, సహస్ర చండీ మహాయజ్ఞ రాజహంస బ్రహ్మశ్రీ అంపోలు రుద్రకోటేశ్వరశర్మ, ఉభయవేదాంత ప్రవర్తక పాంచరాత్రాగమప్రవీణ శ్రీమాన్ చామర్తి శ్రీనివాసాచార్యులతో భక్తులకు ప్రవచన కార్యాక్రమంలు నిర్వహించటం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామివారి సేవలో పునీతులు కావాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.

వేతనదారులకు వందరోజుల పని దినాలు కల్పిస్తాం

డ్వామా పిడి గంటా వెంకట చిట్టిరాజు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : జాబ్ కార్డు కలిగిన వేతనదారులందరికి వంద రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యంగా గ్రామ, పంచాయతీ, మండల స్థాయిలో పనులను గుర్తించడం జరిగిందని, ఈ అవకాశాన్ని ఉపాధి హామీ పథకం కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టిరాజు కూలీలను కోరారు. శుక్రవారం మండలంలోగల హరిశ్చంద్రపురం పంచాయతీలో ఉపాధిహామీ వేతన దారులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో పనులు జరుగుతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. గట్టును వెడల్పు చేయడం, బెంచింగ్ పనులు చేయడంతో పాటు పార్కును తలపించే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గ్రామస్తులకు అందించాలని సూచించారు. కుటుంబాలకు అవసరం మేరకు జాబ్ కార్డులు అందజేయడం జరుగుతుందని, అదే సమయంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం 100 రోజులు పాటు పనిచేయాలని అన్నారు. సగటు వేతనం పెంపుపై సిబ్బంది ప్రధానంగా దృష్టి సాధించాలని, గరిష్ట వేతనం కూలీలకు అందే విధంగా పనులు చేయించాలన్నారు. శ్రమ శక్తికి జిల్లా చిరునామా వంటిదని, ఉపాధి పథకం అమలులో జాతీయస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకుగాను కూలీలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. నాణ్యతతో కూడిన పనులు చేయడం వలన వాటి ఫలితాలు గ్రామీణ ప్రజలు అందరికీ అందుతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు లోకేశ్వరరావు, మురళిక్రిష్ణ, ఉపాధిహామీ ఏపీవో జి. హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ధరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర- ఇచ్ఛాపురం : పురుషోత్తపురంలో గల ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో 2023-2024 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదవ తరగతిలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రాప్తికి ఇంటర్మీడియట్‌లో సీట్లు కేటాయించడం జరుగుతుందని ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. మే 22 నుండి జూన్ 27వరకూ ధరఖాస్తులు ఆఆఇ.ఎంవ.ఖజూ.స్త్రశీజ.అఅ, ఖజూఎం.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ల ద్వారా సమర్పించుకోవచ్చని, ఓ.సి, బి.సి, ఈ.డబ్ల్యూ.ఎస్ విద్యార్థులు రూ॥200/-లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ॥150/-లు ధరఖాస్తు రుసుము చెల్లించాల్సివుంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 10 నుండి 6వ తరగతిలో ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని, 22 వరకూ ధరఖాస్తులు చేసుకోవచ్చని, వచ్చే నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఓ.సి/బి.సిలు రూ॥ 150/-లు, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ॥ 75/-లు ఫీజు చెల్లించాల్సివుంటుందని ఆయన తెలిపారు. వివరాలకు 9032220333, 7382669499, 7013988223 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పది నిముషాల్లో ధృవపత్రం జారీ

విశాలాంధ్ర-మెళియాపుట్టి : సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న ప్రతి నిమిషాలలో వివాహ ధ్రువపత్రం అంద జేయడం జరిగిందని పెద్ద పద్మాపురం సచివాలయ కార్య దర్శి చింతల అప్పారావు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని పెద్దపద్మాపురం సచివాలయంలో అదే గ్రామానికి చెందిన వెంకటరావు వివాహ ధృవపత్రం కొరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయంలో కేవలం పది నిముషాలలో ధృవపత్రం మంజూరు కావడంతో కార్యదర్శి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ దిలీప్ లను గ్రామంలో పలువురు అభినందించారు. గ్రామ సచివాలయవ్యవస్థ ఏర్పాటుచేసిన తర్వాత ప్రజలు కార్యాలయాల చుట్టూతిరగాల్సిన అవసరంలేదని కార్యదర్శి అప్పారావు తెలిపారు. ఆధార్ నవీకరణలో పెద్దపద్మాపురం డిజిటల్ అసిస్టెంట్ ముల్లి దిలీప్ కు రాష్ట్రంలోనే మొదటిస్థానం లభించిన విషయాన్ని గుర్తు చేశారు.

చిక్కాల గోవిందరావును సీపీఐ నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు పెద్ద కుమార్తె అరుణ కుమారి అనారోగ్యంతో మృతిచెందారు. మృతి వార్త తెలుసుకొని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనపాన షణ్ముఖ రావు, సీపీఐ శ్రీకాకుళం నగర కార్యదర్శి డోల శంకరరావు, సహాయ కార్యదర్శి కొమర భాస్కర రావు, సీపీఐ నాయకులు పట్టా ప్రసాద్, నీలవేణిలు చిక్కాల గోవిందరావు ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించి అరుణ కుమారి మృతి పట్ల నివాళి అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపి, ఆమె కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి : కోర్స్ డైరక్టర్

విశాలాంధ్ర -శ్రీకాకుళం: విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధనా నైపుణ్యాలు ఉండాలని డిప్యూటీ వైస్ ప్రిన్సిపాల్ వృత్యంతర శిక్షణ కోర్సు డైరెక్టర్ ఎం భారతమ్మ అన్నారు. స్థానిక వమరవెల్లి డైట్ లో 1998, 2008, 2018 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులకు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల ముగింపు సమావేశం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత బోధనతో ప్రయోజనం ఉంటుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆకలింపు చేసుకుని తరగతి గదిలో బోధన సాగాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలో 100శాతం ఆచరణలో పెట్టాలని తద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఇంకా మెరుగుపరచాలని తెలియజేసారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ శిక్షణా కాలంలో ఏర్పాట్లు, శిక్షణపై ఆనందాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు అల్లు అప్పన్న, ఎస్పి అనిత రాణి, ఎస్ఆర్‌పిలు కె. ఈశ్వరరావు, బానోజీ రావు, పివిఎస్ఎన్ మూర్తి, హిమగిరి, సూర్యనారాయణ, పి.సింహాచలం, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోగలమని జిల్లా ఉపాధి కల్పనాధికారి జి శ్రీనివాసరావు తెలిపారు. ఇచ్చిన ప్రభుత్వ ఐటిఐ లో స్కిల్ హబ్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విలువైన కాలాన్ని వినియోగించుకొని ముందుకు సాగాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పొందిన 30 మందిలో విశాఖపట్నం కు చెందిన ఎస్బిఐ క్రెడిట్ కార్డు, మోరీ టెక్ సంస్థల్లో 17 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. మిగిలిన అభ్యర్థులకు కూడా కొద్ది రోజుల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ ఎస్ డి సి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పిబి సాయి శ్రీనివాస్ సెట్ శ్రీ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ స్ట్రీమ్ ఏపీ ఈఏపీ సెట్

మొత్తం 5318 మంది హాజరు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ 2023 పరీక్షలు శుక్రవారం తో ముగిసాయి. జిల్లాలో శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ లో ఈ పరీక్షలు జరిగాయి. ఐదు రోజుల్లో మొత్తం 5,520 మందికి 5,318 మంది హాజరయ్యారు. ఈనెల 22, 23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ సెట్ జరగనుంది.